క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేస్తున్న కల్పనా చౌదరి

పాల్వంచరూరల్: నాగారం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కల్పనా చౌదరి నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, సత్యవతి, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రాజు, పద్మావతి, స్వాతి పాల్గొన్నారు.

కిచెన్ షెడ్ నిర్మాణానికి వితరణ..

కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరి సహకారంతో నాగారం గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో రూ.30వేల ఖర్చుతో వంటషెడ్‌ను నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా సోమవారం కల్పనా చౌదరి మాట్లాడుతూ.. మారుతున్న సమాజం కోసం ప్రభుత్వ పాఠశాలలు శరవేగంగా అభివృద్ధి చెందాలని, నాణ్యమైన విద్యా బోధన అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు.

అన్నదానం

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామ పంచాయతీ బచ్చలకోయగూడెం గ్రామానికి చెందిన కల్తి నాగేశ్వరరావు, నాగజ్యోతి దంపతుల పెద్దకుమారుడు ప్రేమ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం కొత్తగూడెం బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని యాచకులకు అన్నదానం చేశారు.

నానో యూరియా వాడండి..



రైతులతో మాట్లాడుతున్న సురేందర్‌రావు

టేకులపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంటలకు నానో యూరియా, నానో డీఏపీ వాడటం వల్ల అధిక దిగుబడులు వస్తాయని బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం సొసైటీ కార్యాలయం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితిలోనూ నానో యూరియా, నానో డీఏపీలను మొక్కల మొదళ్లలో వేస్తే లాభసాటిగా ఉంటున్నారు. ఈ కార్యక్రమంలో సీతంల ప్రేమాచారి, కందుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాను అరికట్టండి..



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుజాతనగర్: అక్రమ ఇసుక మాఫియాను అరికట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ మాట్లాడుతూ... వేపలగడ్డ గ్రామంలోని ఎదుళ్లవాగు సమీపంలోని శ్మశానవాటిక స్థలం ఇసుక మాఫియాకు అడ్డాగా మారిందన్నారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నల్లగోపు పుల్లయ్య, ఉడుగుల శ్రీకాంత్, బచ్చలకూర శ్రీను, శ్రీధర్, కొంపెల్లి అయిలయ్య, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇప్పిస్తాం..



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు

టేకులపల్లి: ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇప్పించే బాధ్యతను పీఆర్‌టీయూ తీసుకుంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పూనెం నర్సయ్య ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం టేకులపల్లి మండలంలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సులానగర్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రవీందర్, భాస్కర్, విజయ నిర్మల, రమేష్ బాబు, రమణ, రమేష్, శ్రీను, శ్రీరాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవదాసు పాఠశాల సిబ్బంది స్వరూప, శ్రీలక్ష్మి, మురళీధర్, వెంకట్ రెడ్డి, లక్ష్మణ్, బాలు, శ్రీను, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వర్షం వస్తే చెరువే..

- ముంపునకు గురవుతున్న దమ్మపేట రోడ్డు
- శివనగర్, తెలంగాణ నగర్, శ్రీనివాస కాలనీవాసులకు కష్టాలు
- డ్రెయినేజీని మొర్రేడుకు కలపని మున్సిపల్ అధికారులు



వరద వచ్చినప్పుడు ఆందోళన చేస్తున్న స్థానికులు (ఫైల్)

పాల్వంచ: వర్షాకాలం వచ్చిందంటే పాల్వంచలోని దమ్మపేట రోడ్డు శివనగర్, కార్మెల్ గుట్ట వద్ద ముంపునకు గురవుతుంది. దీంతో వాహనాలు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నక్కలగండి నీరంతా రోడ్డుపై పారుతుండటమే గాక దిగువన ఉన్న శ్రీనివాస కాలనీ, భద్రాద్రి టౌన్‌షిప్, మరోవైపు శివనగర్, తెలంగాణ నగర్ తదితర ఏరియాల్లోని పలు ఇళ్లు వరదలో నానుతున్నాయి. భారీ ఎత్తున నీళ్లు నిలుస్తుండటం వల్ల పాల్వంచ నుంచి ములకలపల్లి, దమ్మపేటకు రాకపోకలు సాగించే వారంతా అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. వరద వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై గతంలో అధికారులు అతిపెద్ద డ్రెయినేజీని కార్మెల్ గిరి వరకు నిర్మించి వదిలేశారు. దీంతో వర్షం వచ్చినప్పుడు రాతి చెరువు నిండి అలుగు నీరు, నక్కల గండి నీరు, పట్టణంలోని పలు ఏరియాల నుంచి వచ్చే నీరంతా రహదారిపై, దిగువన ఉన్న ఏరియాలను ముంచెత్తుతోంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

డ్రెయినేజీని మొర్రేడుకు కలిపితేనే...

దమ్మపేట రోడ్డులో వరద నీరంతా డ్రెయినేజీల ద్వారా మొర్రేడు వాగు వరకు కలపాలని, వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులను పరిష్కరించాలని స్థానికులు పలుమార్లు కలెక్టరేట్, మున్సిపాలిటీ కార్యాలయంలో, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. ఈ వరద నీటి వల్ల ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి మందగించిందని, ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందులు పడుతున్నారని, రేట్లు సైతం పడిపోయాయని ఆవేదన చెందుతున్నారు. వరద ముంపు నుంచి తమకు పరిష్కారం చూపించాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం..

వర్షం వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రహదారి గుండానే ములకలపల్లి, దమ్మపేట, రాజమండ్రి వరకు అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై నిలబడిన సమయంలో వాహనాలు నిలిచి గంటల తరబడి ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపించాలని కోరుతున్నారు.



దమ్మపేట రోడ్డుపై నిలిచిన నీరు (ఫైల్)



రోడ్డు దిగువ భాగంలో పోటెత్తుతున్న వరద

డ్రెయినేజీ నిర్మించాలి...



వర్షం వస్తే దమ్మపేట రోడ్డులో వరద నీరు నిలిచి వాహనాల నిలిచిపోతున్నాయి. ఏటా ఇలానే జరుగుతోంది. నిత్యం వందలాది వాహనాలు ఇటుగా వస్తుంటాయి. వరద నీటిని మళ్లించేందుకు డ్రెయినేజీని పూర్తి స్థాయిలో నిర్మాణం చేయాలి. డ్రెయినేజీలను మొర్రేడు వాగు వరకు కలిపితే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. పలుమార్లు అధికారులు, పాలకులకు చెప్పానా పట్టించుకోవడం లేదు.

– నరేష్, శివనగర్

ఇళ్లలోకి వరద..



వర్షాకాలంలో ప్రధాన రోడ్డు దిగువన ఉన్న శ్రీనివాస కాలనీ దిగువ ఉన్న ఇళ్లల్లోకి వాననీళ్లు వస్తున్నాయి. వరద ముంచెత్తకుండా అధికారులు చొరవ చూపి శాశ్వత పరిష్కారం చూపించాలి. గతంలో అనేకసార్లు అధికారుల దృష్టికి కూడా స్థానికులు అంతా కలిసి విన్నవించారు. ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షం వచ్చి పోయిన తరువాత వారం రోజులు వరకు కూడా స్థానికులు బురదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– ఉమామహేశ్వరరావు, శ్రీనివాస కాలనీ

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న హరిప్రియ

టేకులపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం బోడు, ముక్కంపాడు గ్రామ పంచాయతీలలోని పలు గ్రామాలలో పర్యటించి గ్రామాలలో నెలకొన్న సమస్యలపై ఆరాతీసి కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరిని ఎండగట్టారు. ఓటుతో రాబోయే పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బానోతు రామానాయక్, బొమ్మర వరప్రసాద్, భద్రం, నరసింహారావు, ప్రశాంత్, ఎట్టి ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టాన్ని అమలు చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వ్యవస్థలో కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూగూడెంలోని రైటర్ బస్తీ కార్యాలయంలో జరిగిన ఏరియా కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు అవుతున్నా పాలకుల తీరు మారలేదని, కార్మికుల పట్ల నాటి బ్రిటిష్ వ్యవస్థ కంటే దారుణంగా ఉందన్నారు. 2018లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. ఎన్నికల ముందు కార్మికులను అడ్డం పెట్టుకొని అనేక హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని మర్చిపోవడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సంజీవ్, సంజీవరావు, వాసు, వెంకటమ్మ, కృష్ణ, మల్లికార్జున్‌రావు, మారుతీరావు, శరత్, కరుణ, నాగలక్ష్మి, అవినాష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మహిళలకు రక్షణ కల్పించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: మహిళలు, విద్యార్థినులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఒడిశా కళాశాలలో జరిగిన సంఘటనపై సోమవారం కొత్తగూడెంలోని బస్టాండ్ సెంటర్‌లో కళ్లకు గంతలు కట్టుకొని ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్ మాట్లాడుతూ... ఒడిశాలోని బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ అటానమస్ కాలేజీలో జరిగిన సంఘటన దారుణమన్నారు. 'బేటీ బచావో'లో బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో నయీమ్, ఉస్మాన్‌అలీ, కాటి సంతోష్, షేక్ షాను, నిఖిల్, సమీర్, షాహిద్, జమీర్, పవన్ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపునకు పోటెత్తారు..



దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు



రోడ్డుపై నిలిపిన బైక్‌లు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపుకు ఇల్లెందు, ఆళ్లపల్లి, గుండాల, టేకులపల్లి మండలాల నుంచి ప్రజలు పోటెత్తారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ఆధార్ ప్రత్యేక క్యాంపును ప్రారంభించారు. మున్సిపల్ ఆవరణలో షామియానాలతో ప్రత్యేక కౌంటర్లు నెలకొల్పారు. పెద్దఎత్తున ప్రజలు పోటెత్తటంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. వాహనాలు, ఆటోలు, బైక్‌లతో నిండిపోయింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గదిలో ఊపిరి ఆడనంతగా ప్రజలు క్యూ కట్టి సవరణలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌ను ఆధార్ ఇక్కట్లు పట్ల వివరణ కోరగా.. కలెక్టర్ సూచనల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వసతి గృహం ఆకస్మిక తనిఖీ



పరిసరాలను పరిశీలిస్తున్న రాజేందర్

కొత్తగూడెంఅర్బన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ సోమవారం రామవరంలోని ఎస్సీ ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని తరగతి గదులు, కిచెన్, స్టోర్ రూమ్‌లను, పరిసరాలను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండడం పట్ల న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. శుభ్రత పట్ల చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

నేడు కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

జూలూరుపాడు: జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరగనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఆర్ఐను నియమించండి..

జూలూరుపాడు: స్థానిక తహసీల్‌లో ఆర్ఐను నియమించాలని కోరుతూ కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ రాంబాబు నాయక్ మీడియాతో మాట్లాడుతూ.. తహసీల్‌లో ఇద్దరు ఆర్ఐలు ఉండాల్సినప్పటికీ ఒక్కరే పని చేస్తుండటంతో పనులు సకాలంలో జరగడం లేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే మరో ఆర్ఐని నియమించాలని కోరారు. కార్యక్రమంలో బానోత్ సక్రియా ఉన్నారు.

వేతనాలు అందక ఇక్కట్లు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు అందక తీవ్ర ఇక్కట్లు పాలవుతున్నారని గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేకే సివిల్, జేకే ఓసీ, 24 సివిల్, కేఓసీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతీనెల 7వ తేదీన వేతనాలు చెల్లించాల్సి ఉంది. నిబంధనలు ఉల్లంఘించి 20వ తేదీన చెల్లించటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సమయానికి చెల్లించాలని పేర్కొన్నారు.


'సీతారామ'తో జిల్లాకు అన్యాయం



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

ఇల్లెందురూరల్: సీతారామ ప్రాజెక్టుతో జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అన్నారు. మండలంలోని 21పిట్ ఏరియాలో సీపీఐ మండల మహాసభ సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగిస్తూ.. సీతారామ ప్రాజెక్టుకు ఇల్లెందు నియోజకవర్గంలో శంకుస్థాపన చేసినప్పటికీ చుక్క నీరు అందకుండా పోయిందన్నారు. రీడిజైన్ పేరుతో కొన్ని ప్రాంతాలకే నీటి సరఫరా చేపట్టి జిల్లా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. సీతారామ జలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ రూపాల్లో ఉద్యమాలు చేశామని, భవిష్యత్‌లో గోదావరి జలాలను జిల్లాకు పూర్తిస్థాయిలో అందించేలా క్రియాశీలక ఉద్యమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దీనికోసం జిల్లా మహాసభలో కార్యచరణ రూపొందిస్తామని చెప్పారు. 21పిట్ ఏరియాలో నిర్వాసితులు, క్వార్టర్లలో నివాసం ఉండే వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేసే వరకు సీపీఐ ఉద్యమిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణంగా దేశవ్యాప్తంగా కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండటం వల్లే దేశంలో ధరలు అమాంతం పెరుగుతున్నాయని వాపోయారు. పార్టీ నిర్మాణంపై దృష్టి సారిస్తూనే ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఉద్యమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మిర్యాల రంగయ్య, సారయ్య, శంకర్, నజీర్ అహ్మద్, బందం నాగయ్య, బాస శ్రీనివాస్, మంచాల వెంకటేశ్వర్లు, వడ్ల శ్రీను పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా సత్యనారాయణ



సీపీఐ మండల కార్యదర్శిగా బొప్పిశెట్టి సత్యనారాయణ ఎంపికయ్యారు. మండలంలోని 21పిట్ ఏరియాలో సోమవారం జరిగిన పార్టీ మండల మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా బాసిపాక రవి, ఆకుల చంద్రర్‌రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా ప్రకటించారు.

మెడికల్ బోర్డ్ నిర్వహించండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ నూతన డైరెక్టర్ పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్‌గా బాధ్యతలు స్వీకరించిన గౌతమ్ పొట్రు సింగరేణిలో నాలుగు నెలలుగా నిలిచిపోయిన కార్పొరేట్ మెడికల్ బోర్డ్‌ను నిర్వహించాలని కార్మికులు, కార్మిక సంఘాల నేతలు కోరుతున్నారు. గతంలో ఇలా లేదని, సీఎంఓగా ఎవరు బాధ్యతలు చేపట్టినా వెంటనే కచ్చితంగా మెడికల్ బోర్డ్ నిర్వహణ జరిగేది.. ఇప్పుడు నిలిచిపోవంతో సుమారు 1200 మంది కార్మికులు మెడికల్ బోర్డ్ కోసం ఎదురు చూస్తున్నట్లు చెబుతున్నారు.

ఇప్పటికైనా వీలైనంత త్వరలో మెడికల్ బోర్డ్ నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వాలని కార్మికులు కోరుతు న్నారు.

కళాశాలలకు నిధులు కేటాయించాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

టేకులపల్లి: భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సరైన ప్రయోగశాలలు లేకపోవడంతో వారు ప్రయోగాలు చేయడంలో వెనుకంజలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఖండించారు. విద్యార్థులకు కనీసం తాగడానికి నీళ్లు లేక బయట కొనుక్కొని తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలలో క్లాస్ రూముల్లో ఫ్యాన్లు, మరుగుదొడ్లు, ప్రహరీలు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం టేకులపల్లి కాలేజీ ఎదుట ఆందోళన నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిషోర్, విద్యార్థులు సుమంత్, ప్రవీణ్, సురేష్ లక్ష్మణ్, మహేశ్వరి, సుశీల తదితరులు పాల్గొన్నారు .

'సింగరేణి'లో గోరింటాకు పండుగ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా 3 ఇంక్లైన్ బంగ్లోస్‌లో సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆషాఢ మాస గోరింటాకు పండుగ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సేవా అధ్యక్షురాలు జి.మధురవాణి హాజరయ్యారు. మాట్లాడుతూ... ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం తెలంగాణ సంప్రదాయమన్నారు. మహిళల సౌభాగ్యానికి, ఆరోగ్యానికి గోరింటాకు మంచిదనిన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు సేవా అధ్యక్షురాలు వి.రమ, పద్మజా కోటిరెడ్డి, వై.అనిత, క్లబ్ సెక్రటరీ సునీత మురళి, సేవా సభ్యులు పాల్గొన్నారు.



హాజరైన మహిళలు, సేవా సభ్యులు

25న రైతు రుణమాఫీ దీక్ష



మాట్లాడుతున్న సురేష్ నాయక్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 25న కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో రైతు రుణమాఫీ దీక్షను చేపడుతున్నట్లు సేవాలాల్ జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రైతులకు ఇచ్చిన హామీలు నేతి బీరకాయలో నెయ్యి చందంగా మారిందని విమర్శించారు. రైతు రుణమాఫీ అందరికీ వర్తింపజేయలేదని రైతు భరోసా అందరికీ అందడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యల సాధన కోసం నిర్వహించే రైతు రుణమాఫీ దీక్షను అన్నివర్గాల ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో లావుడ్యా వెంకటేష్, బానోత్ నాగరాజు, జర్పుల లాలునాయక్, లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

హైవేపై పొంచి ఉన్న ప్రమాదం





కేశవాపురం వద్ద హైవేపై ప్రమాదకరంగా ఉన్న గుంత, క్వలర్టు వద్ద కోతకు గురైన రోడ్డు

నిత్యం 24 గంటలు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే భద్రాచలం జాతీయ రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. కేశవాపురం గ్రామ సమీపంలోని క్వలర్టుపై ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. దీనికి తోడు రహదారి పక్కకు రోడ్డు కోతకు గురయింది. ఏమాత్రం ఏమరపాటుగా వాహనాలను నడిపినా ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. రాత్రి సమయంలో అయితే మరింత ప్రమాదకరం. గతంలో వాహనదారులు గుంతలో పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

- పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: యుగంధర్, ఎన్‌హెచ్ ఈఈ
సెల్ నంబరు: 8333923755